



# దేముడు

**- సి.ఎన్.చంద్రశేఖర్**




వర్షం అంతకంతకూ ఎక్కువవుతూంది. కారు డ్రైవ్ చేస్తున్న మాధవ్ మనసు ఆందోళనగా ఉంది. సమయం రాత్రి పదకొండవుతూంది. ప్రయాణిస్తున్నది సెకండ్ హ్యాండ్ కారులో. ప్రక్కన అందమైన భార్య. కారు హెడ్ లైటు వెలుతురు తప్పిస్తే చుట్టూ చిమ్మచీకటి. కుండపోతగా కురుస్తున్న వర్షం. ఇంతదాకా తిరుపతి లోకల్‌లో తిరగడం తప్పితే బయటి ఊళ్ళకు ఆ కారులో ప్రయాణించలేదు. కారుకు సంబంధించి చిన్న మెకానిజమ్ కూడా అతనికి తెలియదు. గూడూరు చేరాలంటే యింకా పది కిలోమీటర్లు ప్రయాణించాలి. 'ఈ లోపల కారు నిలిచిపోతే' అన్న ఆలోచన భయపెడుతూంది అతన్ని.

అందుకు కారణం లేకపోలేదు. తిరుపతి నుంచి బయలుదేరినప్పటి కారు బాగా సాగినట్టే అనిపించింది. శ్రీకాళహస్తి దాటగానే వర్షం మొదలైంది. రోడ్డంతా వాన నీళ్ళు నిండటంతో ఎక్కడ గుంతలున్నవో, ఎక్కడ లేవో తెలియక యిబ్బంది పడ్డాడు. నాయుడు పేట దాటినప్పటి నుంచీ ఇంజను నుంచి ఏదో శబ్దం రాసాగింది. అప్పట్నుంచీ పట్టుకుంది అతనికి భయం.

"ఏమిటండీ. వాన యింత పెద్దగా కురుస్తూంది. ఇంత పెద్ద వానను నేనెప్పుడూ చూడలేదు"అంది భార్య సుప్రియ భయంగా.

'భయమెందుకు? ఇంకో పావుగంటలో మనం గూడూరులో పెళ్ళి పందిట్లో ఉంటాం" అన్నాడు ఆమెకు ధైర్యం చెబుతూ.

ఉన్నట్టుండి కారు ఆగిపోయింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా తిరిగి స్టార్ట్ కాలేదు.

"ఏమైంది?" ఆదుర్దాగా అడిగింది సుప్రియ.

"నాకెలా తెలుస్తుంది. నేనేం కారు మెకానిక్‌నా? కొంచెం సేపు ఓపిక పట్టలేవు" విసుగ్గా అన్నాడు మాధవ్. అతనూ ఆందోళన పడుతున్నాడని, యిప్పుడు తనేం ప్రయత్నించినా అది అతని విసుగును మరింత పెంచుతుందని ఆమెకు అర్థమైంది. అందుకే ఎదురుగా ఉన్న వెంకటేశ్వర బొమ్మను చూస్తూ మనసులోనే ప్రార్థించుకోసాగింది.

టైము చూశాడు మాధవ్ 'పదకొండున్నర.'

రాత్రిపూట ప్రయాణం మంచిది కాదని, అతనికింకా డ్రైవింగ్ అలవాటు కాలేదు కాబట్టి సాయంత్రమే బయలుదేరుదామని చెప్పింది సుప్రియ. అయితే మాధవ్ ఆఫీసునుంచి వచ్చేసరికే రాత్రి పదయ్యింది. ఎనిమిది గంటలకు బయలుదేరి తిరుపతిలోనే ఓ హోటల్‌లో భోజనాలు ముగించి ప్రయాణమయ్యారు.

**ఉగాది పోటీలో ఎంపికైన కథ**

పావుగంట గడిచింది. కారు కదల్లేదు. వాన మరింత పెద్దదైంది. ఉరుములు, మెరుపులు జత కలిశాయి. క్షణం ఒక యుగంలా గడుస్తూంది వాళ్ళకు.

'ఈ రూట్లో మామూలుగా ట్రాఫిక్ ఎక్కువ ఉంటుంది. ఈరోజు ఒక్క వెహికల్ కూడా కనిపించడం లేదు. కొంపదీసి టీవీల్లో, రేడియోలో తుఫాను హెచ్చరిక విని అందరూ ఎక్కడివాళ్ళక్కడే నిలిచిపోయారా? తాము మాత్రం విషయం తెలియకుండా బయలుదేరి వానలో యిలా చిక్కుకున్నారా?' ఆ ఆలోచన రావడంతోనే అతనిలో భయం మరింత పెరిగింది.

ఇంతలో సుప్రియ వేసిన కేకకు ఉలిక్కిపడ్డాడు.

"ఏమైంది?"అంటూ ఆమెవైపు చూసిన అతనికి ఒళ్ళు జలదరించింది. సుప్రియ కూర్చున్నచోట షట్టర్లు దగ్గర ఎవరో మనిషి ముఖం దగ్గరపెట్టి చూస్తున్నాడు. రూపం కనిపించడం లేదు గాని తల ఆకారం మాత్రం కనిపిస్తూంది.

"ఎవరది?" అరిచాడు మాధవ్.

"షట్టర్స్ మూసి ఉంటే అతనికెలా వినబడుతుంది?"అంది సుప్రియ వణికిపోతూ. మాధవ్ అటువైపు రమ్మని చేతులతో సంజ్ఞ చేశాడు. ఆ ఆకారం మాయమైంది. మళ్ళీ మాధవ్ ప్రక్కనున్న షట్టర్ దగ్గర ప్రత్యక్షమైంది.

భయపడుతూనే షట్టర్ కాస్త క్రిందికి దింపి "ఏం కావాలి?"అని అడిగాడు. "కారు రిపేరీలో ఉన్నట్టుంది. నాకు రిపేరీ చేయడం వచ్చు. బానెట్ తెరవండి. చూస్తాను."

అలాగేనన్నట్టు తలాడించాడు మాధవ్. అతను కారు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. నల్లగా, ఎత్తుగా, లావుగా ఉన్నాడతను. కండలు తిరిగిన శరీరం. ఖాకీ నిక్కరు, కట్ బనీను ధరించి ఉన్నాడు. నెత్తిమీద టవల్ చుట్టుకుని ఉన్నాడు. పెద్దగా మెరిసిన మెరుపు వెలుగులో అతన్ని చూసిన యిద్దరూ ఓ క్షణం [illegible].

'బానెట్ తెరవకండి. అతను [illegible] కారు అసలు కదలకుండా చేయగలడు" అంది సుప్రియ.

"అతను ఏం చెయ్యకపోయినా మన పరిస్థితి అదే" అయినా "తెలిసి తప్పుచేయడం ఎందుకు?"అని షట్టర్ దగ్గర తల పెట్టి "రిపేర్ ఏం లేదు పెట్రోల్ అయిపోయింది"అని అరిచాడు.

అతను షట్టరు దగ్గరికొచ్చి "అయ్యో పాపం ఆడకూతురు కార్లో ఉంది. ఎలా వెళతారు పాపం? మీ కారులో పెట్రోలు డబ్బా ఉందా?" అని అడిగాడు.

"ఆ... ఉంది".

"ఉంటే యివ్వండి. మైలు దూరంలో ఓ పెట్రోలు బంకు ఉంది. వెళ్ళి వస్తాను."

మాధవ్ డబ్బా యిచ్చి పర్సు తెరచి అందులోనుంచి ఓ అయిదువందల నోటు తీసి అతనికిచ్చి "ఐదు లీటర్లు తీసుకురా"అన్నాడు.

కారు హెడ్ లైట్ల వెలుగులో అతను వడివడిగా నడుస్తూ వెళ్ళడం కనిపించింది వాళ్ళకు.

"వాడు పెట్రోలు తీసుకురాడని నాకు తెలుసు. అయిదువందలతో వాడి పీడ వదిలించుకుందామని యిచ్చి పంపాను" అన్నాడు మాధవ్ నవ్వుతూ.

అతని వంక ఆశ్చర్యంగా చూసింది సుప్రియ. ప్రతి పైసాను ఆచితూచి ఖర్చుపెట్టే అతను పర్సునిండా వంద రూపాయల నోట్లున్నా వెతికిమరీ ఆ అయిదు వందల నోటును యిచ్చి పంపడం ఆమెకు అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆమె ఆలోచన అర్థమైనట్టు చూస్తూ "ఆ నోటు చెల్లని నోటు" అన్నాడు నవ్వుతూ.

ఆమెకు నవ్వు రాలేదు. అతనంటే అసహ్యం కలిగింది. అమాయకంగా అంత వానలో పెట్రోలుకోసం వెళుతున్న వ్యక్తిపైన జాలి కలిగింది.

దాదాపు పావుగంట గడిచాక వెనుక ఓ వాహనం వస్తూండటం కనిపించింది అతనికి.

"ఏదో వెహికల్ వస్తుంది. బస్సో లారీయో తెలియడంలేదు. నువ్వు దిగి దాన్ని ఆపడానికి ప్రయత్నించు. ఆడవాళ్ళను చూస్తే ఆపుతారు. నేనింతలో డోర్స్ లాక్ చేసుకుని డిక్కీలోని లగేజ్ బయటకు తీస్తాను. కమాన్. క్విక్."

అయిదు నిమిషాల తర్వాత వాళ్ళు ఆ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు.

* * *

పెళ్ళి ముహూర్తం ఉదయం మూడుగంటలకు పందిట్లో అందర్నీ పలుకరించాక సుప్రియ తన బంధువులతో మాటల్లో పడిపోయింది. మాధవ్ మాత్రం ఓ కుర్చీలో కూర్చుని తనతో తెచ్చుకున్న పుస్తకాన్ని చదువుకుంటూ ఉండిపోయాడు.

పెళ్ళిలో బిజీగా తిరుగుతున్న చంద్రం కనిపించాడు సుప్రియకు.

"ఈ పెళ్ళికి కూడా ఇన్‌ఛార్జివి నువ్వేనా?" అని అడిగింది సుప్రియ.

"ఆ... ఏదో ఉడుతా సాయం" అన్నాడు నవ్వుతూ.

చంద్రం పది పన్నెండు పెళ్ళిళ్ళకు ముఖ్య పాత్ర వహించాడు. అన్ని బాధ్యతలూ తన నెత్తిన వేసుకుని పెళ్ళిళ్ళు జరిపించాడు. అతను లేకుండా బంధువుల సర్కిల్‌లో ఏ పెళ్ళీ జరగలేదన్నది వాస్తవం. అయితే అదో గొప్ప విషయంలా తను భావించాడు. కొన్ని మంచి పనులు చేయడానికి భగవంతుడు కొంతమందిని ఎన్నుకుంటాడని, తనూ అలా ఎన్నికైన వాణ్ణని, ఆ విషయంలో మాత్రం తాను అదృష్టవంతుణ్ణని చెబుతాడు.

సుప్రియ మాధవ్‌తో ఎన్నో పెళ్ళిళ్ళకు హాజరైంది. అయితే మాధవ్ ఏ పెళ్ళిలోనూ కల్పించుకుని ఓ పని చేసింది లేదు. కనీసం తన సహాయాన్ని ఆఫర్ కూడా చేయలేదు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" నవ్వుతూ అడిగాడు చంద్రం.

"ఇన్ని పెళ్ళిళ్ళకు సారధ్యం వహిస్తావు. పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో చిన్న తప్పు కూడా దొర్లకుండా చూస్తావు. ఇది నీకు ఎలా సాధ్యం బావా?" అని అడిగింది.

"అనుభవం. పైగా ఏ టైముకు ఏది కావాలో అన్నీ లిస్టు రాసుకుంటాను. అయిపోయిన వాటిని రౌండు చేసుకుంటూ ఉంటాను. నువ్వు గమనించావో లేదో గాని నేను పెళ్ళిపందిరి వదిలి పోవడంలేదు. కుర్రాళ్ళ చేత పనులు చేయించుకుని మార్కులు నేను కొట్టేస్తుంటాను."

"పనులు ఎవరైనా చెయ్యొచ్చు. మానిటరింగ్ చేయడం కష్టం. అందులో నువ్వు ఎక్స్‌పర్ట్‌వి. అవును గాని నీ భార్య చాలా మంచిదటగా. అత్తయ్య చెప్పింది."

"అవును సుప్పీ. ఆ విషయంలో నేనెంతో అదృష్టవంతుడిని. మీ ఆయన కూడా మంచివాడని, నిన్ను బాగా చూసుకుంటున్నాడని విన్నాను. చాలా సంతోషం కలిగింది నాకు."

అంతలో అతన్ని ఎవరో పిలవడంతో వెళ్ళిపోయాడు.

చంద్రం సుప్రియకు మేనమామ కొడుకు. ప్రక్కప్రక్క యిళ్ళలో నివసించడంవల్ల చిన్నప్పట్నుంచీ కలిసి ఆడుకున్నారు- చదువుకున్నారు. సుప్రియకు చంద్రం అంటే చాలా యిష్టంగా ఉండేది. సుప్రియను చంద్రానికి చేసుకోవాలని చంద్రం తల్లిదండ్రులు కూడా ఆశపడ్డారు. అయితే మేనరికంవల్ల పుట్టబోయే పిల్లలకు ఆరోగ్యం సరిగ్గా ఉండదని సుప్రియ తల్లిదండ్రులు భావించడంతో పెళ్ళి జరుగలేదు. అయితే అందువల్ల సుప్రియ చంద్రంల మధ్య స్నేహం చెడలేదు. ఈనాటికీ వారిద్దరికీ ఒకరంటే ఒకరికి అభిమానమే.

అక్కడే నిలబడి ఆలోచిస్తున్న సుప్రియ దగ్గరకు మాధవ్ వచ్చాడు.

"ఏమంటున్నారు మీ బావగారు?" అతని ప్రశ్నలో ఏదో శ్లేష వినిపించింది ఆమెకు. చంద్రం ఎన్నో పెళ్ళిళ్ళకు బాధ్యత వహించడం గురించి చెప్పి, అతన్ని ఎలా చేయగలుగుతున్నావని అడిగానంది.

"ఒక్కో పెళ్ళిలో బాగా కమీషన్ ముడుతుందేమో. అందుకే అంత ఉత్సాహం. లేకుంటే యీ కాలంలో బాధ్యతలు ఎవరు తీసుకుంటారు?" అన్నాడు మాధవ్. అతని వైపు కోపంగా చూసి "అలా కమీషన్ తీసుకునే అవసరం అతనికి లేదు. అటువంటి ఆలోచనా రాదు. ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలియదు తనకు" అంది.



"పనులు ఎవరైనా చెయ్యొచ్చు. మానిటరింగ్ చేయడం కష్టం. అందులో నువ్వు ఎక్స్‌పర్ట్‌వి. అవును గాని నీ భార్య చాలా మంచిదటగా. అత్తయ్య చెప్పింది."

"మీ బావంటే నీకు చాలా యిష్టంలా వుంది. అతన్నంటే అంత కోపం వస్తుంది నీకు."

"మంచితనం అంటే యిష్టం. సరే గాని పదండి. ముహూర్తం టైమవుతూంది. పందిరి దగ్గరికెళదాం" అంది టాపిక్ మారుస్తూ.

"నీ బంధువుల పెళ్ళి కాబట్టి నీవు బిజీగా ఉంటావు. నాకేం తోచక చస్తున్నాను యిందాకట్నుంచీ" అన్నాడు.

"సారీ. ముహూర్తం కాగానే వచ్చి మీ ప్రక్కనే కూర్చుంటానుగా. కొంచెం సేపు అడ్జస్ట్ చేసుకోండి. ప్లీజ్" అంది అభ్యర్థనగా.

అయితే తర్వాత అతని దగ్గరకు వెళ్ళే అవసరం ఆమెకు లేకపోయింది. అందుకు కారణం 'జ్యోతి.'

* * *

'సుప్రియా. ఈవిడ పేరు జ్యోతి. మా ఫ్యామిలీ ఫ్రెండ్స్.'

సుప్రియకు జ్యోతిని పరిచయం చేశాడు మాధవ్.

"నమస్తే. మీ గురించి మావారు ఎప్పుడూ చెప్పలేదు నాకు. మీరు గూడూరులోనే ఉంటున్నారా?"

"అవునండీ. ఈ వీధిలోనే మా యిల్లు. మాధవ్‌ను చిన్నప్పుడెప్పుడో చూశాను. అప్పుడెట్లున్నాడో యిప్పుడూ అలాగే ఉన్నాడు. అందుకే అతను నన్ను గుర్తుపట్టకపోయినా నేను గుర్తుపట్టేశాను."

"ఆడవాళ్ళలో చాలా మార్పులొస్తాయి కదా" అన్నాడు మాధవ్ నవ్వుతూ. ఆ తర్వాత మాధవ్, జ్యోతి మాట్లాడుకోవడం, నవ్వుకోవడం దూరంనుంచి చూస్తూనే ఉంది సుప్రియ. భర్తకు విసుగు కలగకుండా మంచి కంపెనీ దొరికినందుకు ఆమె తృప్తిగా నిట్టూర్చింది.

నాలుగు గంటలకు మాధవ్ సుప్రియ దగ్గరికి వచ్చి 'పెళ్ళి అయిపోయింది కదా. మనం బయలుదేరేసరికి తొమ్మిది దాటుతుంది. మెకానిక్ షాపులు తెరవాలి కదా. ఆ లోపల మనల్ని తన యింట్లో పడుకుని విశ్రాంతి తీసుకోమని జ్యోతి పిలుస్తూంది. ఏమంటావ్?"

"చాలా రోజుల తర్వాత మా వాళ్ళను కలిశాను. మనసు విప్పి మాట్లాడుకోనే లేదు. ఇక్కడే ఉందామండీ."

"పోనీ నేను పోయి కాసేపు నిద్రపోనా."

"అలాగే. మీ యిష్టం."

అరగంట తర్వాత చంద్రం సుప్రియను "మాధవ్ కనపడటం లేదే. ఎక్కడికి వెళ్ళారు?" అని అడిగాడు. సుప్రియ చెప్పింది.

"సుప్పీ. నువ్వు పొరబాటు చేశావు. ఆయన్ను పంపకుండా ఉండాల్సింది."

"ఏం?" ఆందోళనగా అడిగింది.

"జ్యోతి చాలా అమాయకురాలు. 'చింత చిగురు పులుపని, చీకటంటే నలుపని చెప్పిందే తెలియని పిచ్చి పిల్ల' అని ఓ పాటుంది విన్నావా? అంతటి అమాయకురాలు. తన అమాయకత్వంవల్ల ఎన్నో సమస్యలు తెచ్చుకుంది. అయినా యిప్పటికీ ఆమెకు ప్రపంచం అంటే ఏమిటో తెలియడంలేదు. ఈమె గురించి బాధ పడిపడి తల్లిదండ్రులు పోయారు. అన్నయ్యా ఊరు వదిలి వెళ్ళిపోయాడు. ఆమె చిన్నాన్న కుటుంబం ఆమె ఆలనాపాలనా చూసుకుంటూంది. వాళ్ళు యింకో పెళ్ళికి వెళ్ళాల్సి ఉండటంతో తనను యిక్కడ ఉంచి వెళ్ళారు. ఎప్పుడు వెళ్ళిందో మేమూ గమనించలేదు."

సుప్రియ స్థాణువులా నిలబడి ఉండటం చూసి "సారీ. నీ భర్త అటువంటి వ్యక్తి కాదని తెలిసీ యివన్నీ చెప్పాను. నువ్వేం భయపడకు. వెళ్ళింది నీ భర్త కాబట్టి ఆమెకు ఏ అపకారం జరగదు. నువ్వెళ్ళి ఎంజాయ్ చెయ్" అన్నాడు.

ఆమె కదలకపోవడం చూసి "పోనీ నేను వెళ్ళి చూసి రానా?"అన్నాడు.

"నేను వెళ్తాను." నాకు యిల్లు చూపించు" అంది.

చంద్రం యిల్లు చూపించి వెళ్ళగానే తలుపులు తట్టింది. తలుపు తెరచిన జ్యోతి జుట్టంతా చెదిరిపోయి ఉంది. తిలకం చెరిగిపోయి ఉంది.

"మీరా... రండి... రండి" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది.

ఇప్పుడు కనిపిస్తూంది ఆమెలో... ఏమీ తెలియనితనం.

"మీరు మాధవ్ దగ్గర పడుకోండి. నేనింకో గదిలో పడుకుంటాను" అంటూ వెళ్ళిపోయింది. గదిలోకి వెళ్ళిన ఆమె మనసు తీవ్రంగా గాయపడింది.

మంచం నిండా నలిగిన మల్లెలు. దిండు కవర్లపై మాధవ్ ముఖంపై, పెదవులపై లిప్‌స్టిక్ మరకలు.

మాధవ్ తదేకంగా సుప్రియనే చూస్తున్నాడు.

అతనివైపు అసహ్యంగా చూసి 'ఛీ' అని గిరుక్కున తిరిగి బయటకు వచ్చేసింది సుప్రియ.

* * *

బస్సులో మెకానిక్‌తోపాటు బయలుదేరారు భార్యాభర్తలిద్దరూ. కారు ఆగినచోట దిగారు. మెకానిక్ బానెట్ తెరచి చూస్తూంటే డిక్కీలో లగేజ్ పెట్టడానికి కారు వెనుకకు వెళ్ళిన మాధవ్ అక్కడ నిద్రపోతున్న మనిషిని చూసి ఉలిక్కిపడ్డాడు. అతను పెట్రోలు తెస్తానని గత రాత్రి డబ్బులు తీసుకుని వెళ్ళిన వ్యక్తి, ప్రక్కనే పెట్రోలు డబ్బా.

"ఇదిగో... నిన్నే" అతన్ని గట్టిగా పిలిచాడు మాధవ్.

అతను కళ్ళు నులుపుకుంటూ లేచి "వచ్చారా దొరా. రాత్రి నేను తిరిగొచ్చేటప్పటికి మీరు లేరు. ఏమైపోయారా అని భయపడి ఛస్తున్నాను. కారులో లచ్చిమీదేవి లాంటి ఆడ కూతురుంది. మీకేమీ అయి ఉండకూడదని ఎంకన్న బాబును ఏడుకుంటూ యిక్కడే కూచున్నాను" అన్నాడు.

(మిగతా 12వ పేజీలో)

# వింత ఆచారాలు

ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన కట్టుబాట్లు నియమాలు నమ్మకాలు ఆచారాలు ఉంటాయి. మిగిలిన ప్రాంతాలలోని వారి ఆచార వ్యవహారాలు మనకు ఆసక్తిని కలిగిస్తాయి.

రోమ్ ఇటలీలలో పెద్ద వాళ్ళు కాఫీ హోటల్లో కాఫీని నిలబడే తాగుతారు. ఫ్రాన్స్‌లో పిల్లలు పుట్టిన రోజుకు బదులు పేరు పెట్టుకొన్న రోజు (బారసాల)ను పండుగలా జరుపుకొంటారు. యూరప్ దేశాలన్నిటిలోనూ సర్వసాధారణంగా ప్రజలు ఏదైనా తినేప్పుడు ఫోర్క్‌ను ఎడమ చేతిలోనూ చాకును కుడి చేతిలోనూ పట్టుకొంటారు.

దక్షిణ కొరియాలో పెద్దవాళ్ళతో మాట్లాడే సమయంలో తమ కళ్ళ అద్దాలను తీసేస్తారు. అలా చేయడం పెద్ద వాళ్ళకు మర్యాద ఇవ్వడంగా భావిస్తారు. ఉత్తర ఆఫ్రికాలోని చాలా దేశాల్లోని పిల్లలు బడికి గాడిదల మీద వెళతారు. తైవాన్‌లో భోజనం అయిన తర్వాత వండిన వారికి తేనే ఇస్తే వారిని అభినందించినట్లు భావిస్తారు.

ఇథియోపియాలో సుర్మా తెగకు చెందిన ఆడమగా తేడా లేకుండా గుండు గీయించుకొంటారు. ఆడవారు బాగా బరువైన పళ్ళాలు తమ కింద పెదవికి తగిలించుకొంటారు. తద్వారా ఆ కింద పెదవి ఎంత బాగా కిందకు సాగితే అంత అందగత్తెగా భావిస్తారు. ఆసియాలోని హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపించే గిరిజనులు ముక్కుకి గడ్డానికి చెక్క క్లిప్పులను తగిలించుకొంటారు తైవాన్ వీథుల్లో తినడం తాగడం అనాగరికంగా భావిస్తారు.

పాకిస్థాన్‌లో పెళ్ళికొడుకు తనకు బంధువులు చదివించిన డబ్బును మాలగా మెడలో వేసుకొంటారు. న్యూజిలాండ్‌లో బహిరంగంగా చూయింగ్‌గమ్ తింటే వారిని ఓ పోకిరిలా భావిస్తారు. రష్యాలో షేక్‌హాండ్ ఇచ్చారంటే అది ఉక్కు పిడికిలే. జపాన్‌లో ఇంట్లో సభ్యులందరూ వేడి నీళ్ళు టబ్‌ను సిద్ధం చేసుకొని సబ్బు రుద్దుకొని వన్‌బై వన్ స్నానం చేస్తారు.


**- కలపర్తి సత్యం**

# బంగారు ముసుగు

పురాతన ఈజిప్షన్ టుటాంఖమన్ బాలరాజు (ఫారో). ఇతను తొమ్మిదేళ్ళు పాలన చేసి తన 18వ ఏట క్రీపూ 1352లో మరణించాడు. ఇతని కళేబరం భద్రపరచబడి మూడు శవ పేటికల గూటిలో మూయబడింది. బయటి రెండు శవ పేటికలు బంగారు పూతతోను, మూడవది బంగారంతోను చేయబడి ఉన్నాయి. నలగగొట్టబడిన బంగారంతో చేయబడ్డ ముసుగు మృత రాజు తలను అలంకరించి ఉంది. ఇది అంతిమ సంస్కారాలకు తగినట్లు అమరిన ముసుగు. 1922లో బ్రిటిష్ పురావస్తు శాస్త్రజ్ఞుడైన హోవార్డ్ కార్టెర్ దీనిని కనుగొన్నాడు.

**- పి.ఎం.సుందరరావు**





# ఎవరెస్టు శుభ్రత

ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని శుభ్రపరచే పని 1990 సంవత్సరం ప్రాంతంలో ప్రారంభమైంది. గుడారాలు, ప్రాణవాయువు సీసాలు, బంగీ వస్తువులు బాటరీల లాటి వందల కొద్దీ చెత్త అక్కడ చేరి పోయింది. నేడు నేపాల్ ప్రభుత్వానికి పర్వతారోహకుల బృందం తల ఒక్కటికీ 4000 డాలర్లను 'చెత్త ధరావతు' చెల్లించాలి. ఆ బృందమే చెత్తను పరిశుభ్రపరచడానికి సంసిద్ధమైతే ఆ సొమ్ము వాపసు చేయబడుతుంది.

**(9వ పేజీ తరువాయి)**

సుప్రియ మాధవ్ వైపే చూస్తూంది. మాధవ్ నమ్మలేనట్టు ఆ వ్యక్తి వైపు చూశాడు.

"మరి... పెట్రోలు దొరికిందా?"

"మిరిచ్చిన నోటు చెల్లలేదు బాబూ. నేను ఆడి కాళ్ళు పట్టుకుని తర్వాత వచ్చి యిస్తానని అడుక్కున్నా యివ్వలేదు. నా ఏలి ఉంగరం ఆడి దగ్గర పెట్టి తెచ్చా" అంటూ చెల్లని నోటును మాధవ్‌కిచ్చాడు అతను.

"అయ్యో. అలాగా" అంటూ రెండువందల రూపాయల నోటు తీసి అతనికిచ్చాడు మాధవ్.

జేబులోంచి చిల్లర యిస్తున్న అతనితో "ఉంచుకో ఫర్వాలేదు" అన్నాడు.

"వద్దు బాబయ్యా. పరుల సొమ్ము పాము వంటిదని మా అయ్య చెప్పేవాడు" అంటూ చిల్లర యిచ్చేశాడు.

"మీరు... వానలోనే... రాత్రంతా... ఉన్నారా?" సుప్రియ అడిగింది.

"నాకలవాటే నమ్మా. ఇదేం పెద్ద వాన? ఈ అడవి, సీకటి, పురుగులు, చెట్లూ అన్నీ నేను రోజూ చూసేవే. నాకు వీటి గురించి భయమేలేదమ్మా. నేను భయపడేది ఒకరినే చూసే."

"ఎవరిని?" ఆతృతంగా అడిగింది.

"మనిషిని. విష నాగుల కంటే ప్రమాదం కలిగించేవాడు మడిషమ్మా. నా జీవితంలో ఎలుగులు నింపిన నా పెళ్ళాం లచ్చిని ఓ మడిషి చెడిపేశాడమ్మా. ఆ అవమానంతో అది కొండ పైకెక్కి దూకేసి సనిపోయింది. అందుకే నాకు మడిషంటే భయమమ్మా. చాలా భయం."

కారు స్టార్టైన శబ్దం వినిపించింది. మాధవ్ వెళ్ళి కారులో కూర్చున్నాడు. మెకానిక్‌కు డబ్బులిచ్చి థాంక్స్ చెప్పాడు.

"మీ... పేరు?" అంతవరకూ అతని పేరు కూడా అడగనందుకు బాధపడుతూ అడిగింది సుప్రియ.

"దేముడు."

"నిజంగా నువ్వు దేవుడవే" మనసులో అనుకుంది.

"వస్తానమ్మా" అంటూ అతను శెలవు తీసుకుని నడవసాగాడు.

కారులో కూర్చున్న సుప్రియ మాధవ్ వైపు చూసింది. అతను సీరియస్‌గా కారు రివర్స్ చేస్తున్నాడు.

'మనిషిని చూసి మృగం అనుకుని అతన్ని దూరంగా తరిమేశాను. కాని నేను ప్రయాణిస్తున్నది ఓ మృగంతోనే అని ఆలస్యంగా తెలిసింది నాకు' అనుకుంది.

ఎదురుగానున్న వెంకటేశ్వరస్వామిని చూస్తూ "భగవాన్. నీకు శక్తుంటే ఆయన్ను మనిషిగా మార్చు. ఆ శక్తి నీకు లేకుంటే నన్ను ఏ సెంటిమెంటల్ ఫీలింగ్స్ లేని ఓ రాయిలా మార్చు" అనుకుంది.

కారు బయలుదేరుతూంటే కిటికీలోంచి వెనక్కు తిరిగి చూసింది. దేముడు వెళ్తున్నాడు. రెండుచేతులూ జోడించి నమస్కరించింది అతనికి. ఆమె కళ్ళనుంచి కన్నీరు కారి చెంపల మీదుగా నేల తల్లిని మృదువుగా స్పృశిస్తున్నాయి.

★